# పెద్దగీత

ఎస్.రమేష్‌బాబు

తెలుగు కళాసమితి న్యూజెర్సీ — రాజాలక్ష్మి ఫౌండేషన్‌వారి కథల పోటీలో బహుమతి పొందిన కథ.

## ట్రింగ్...
## ట్రింగ్ ... ట్రింగ్.

కాలింగ్ బెల్ మ్రోగింది. ఉలిక్కిపడి కళ్ళు తెరిచాను. ఇంటిపనులన్నీ పూర్తిచేసి, భోజనం కానిచ్చి, కాసేపు కునుకుతీద్దామని అప్పుడే పడుకున్నాను. నిద్రలోకి జారుతున్న సమయంలో వినిపించిన కాలింగ్ బెల్ మోత కర్ణకఠోరంగా అనిపించింది.

ఈ టైంలో ఎవరబ్బా వచ్చేది? ఆయన రోజూ ఆఫీసుకి క్యారియర్ తీసుకెళతారు. పిల్లలు రాధ, రవి కాలేజీ నుండి వచ్చేటప్పటికి సాయంత్రం అవుతుంది. ఈ టైంలో సాధారణంగా ఎవరూ రారు.

ఆలోచిస్తూనే గుమ్మం దగ్గరకెళ్ళి తలుపులు తెరిచాను. ఎదురుగా ఎవరో అపరిచితుడు.

'ఎవరు కావాలి?' అన్నట్లుగా ప్రశ్నార్థకంగా చూశాను.

"ఇది ఇంజనీర్ చక్రవర్తి గారిల్లేనా?" ఆత్రంగా అడిగాడు.

"అవును!" అతను చెప్పబోయేది ఏమై వుంటుందా అని ఆలోచిస్తూ అన్నాను.

" 'సార్'కి ఆఫీసు పనిమీద బయటికి వెళ్ళి వస్తుంటే యాక్సిడెంట్ అయ్యింది"

తరువాత అతనేం చెప్పాడో నాకు వినిపించలేదు. కళ్ళముందు అంతా చీకటి. నాకు స్పృహ తప్పింది.

* * *

ఆయన పోయి అప్పటికి పదిహేను రోజులయ్యింది. అనుక్షణం ప్రతిక్షణం ఆయన జ్ఞాపకాలే వెంటాడుతున్నాయి. ఎక్కడ చూసినా ఆయన రూపమే కనిపిస్తోంది. పెళ్ళయి ఇరవై ఏళ్ళయినా నన్ను అపురూపంగా చూసుకున్న ఆయన జ్ఞాపకాలు నన్ను చిత్రవధ చేస్తున్నాయి. ఇక ఈ జీవితానికి అర్థం, విలువ లేవు. భవిష్యత్తు మీద ఎలాంటి ఆశలూ లేవు.

పిల్లలు ఎంత బ్రతిమలాడినా, ఏడ్చినా గొంతులో ముద్ద దిగడం గగనం అయిపోతోంది. ఈ పదిహేను రోజుల్లో పదిహేను మెతుకులన్నా లోపలికి వెళ్ళాయో లేదో? కనీసం వాళ్ళకోసమయినా నేను బాధని మరిచిపోలేక

> "నేను ఇంత దారుణంగా ఆలోచిస్తున్నానేమిటి? నా మనస్తత్వం ఇంత భయంకరమైనదా? ముక్కుపచ్చలారని పిల్ల పసుపుకుంకుమలు పోగొట్టుకుంటే సానుభూతి చూపవలసింది పోయి సంతృప్తి చెందుతున్నానేమిటి? జీవితంలో మూడువంతులు అయిపోయినదాన్ని నేనే ఇన్నాళ్ళుగా ఇంతగా కృంగిపోతోంటే ఎంతో జీవితం ముందున్న అఖిల పరిస్థితి ఏమిటి?"

పోతున్నాను. బంధువులు, స్నేహితులు ధైర్యం చెప్పాలని చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. బాధను మరిచే ప్రయత్నమే చేయలేకపోతున్నాను. ఎంత ప్రయత్నించినా మనసు అదుపులోకి రావడంలేదు. రోజు రోజుకీ ఆత్మహత్యను గురించిన ఆలోచనలు ఎక్కువ కాసాగాయి.

మరో వారం రోజులు అతి భయంకరంగా గడిచాయి.

ఆ రాత్రి కూడా రోజూలాగానే నిద్రపట్టక, జ్ఞాపకాలు వదలక అవస్థపడుతున్నాను. ప్రక్కింటిలో నుండి అకస్మాత్తుగా ఏడుపులు మొదలయ్యాయి. అసంకల్పితంగా లేచి కూర్చున్నాను. గుండె వేగం ఎక్కువయ్యింది. అసలే అస్థిపంజరంలా వున్నానేమో స్పృహ తప్పేటట్లుగా వుంది.

"ఏమైంది మమ్మీ?" కంగారుగా రవి పరిగెత్తుకొచ్చాడు.

ప్రక్కింటివైపు వ్రేలు చూపించాను, ఆయాసంతో మాట్లాడలేక. నన్నక్కడే వదిలి రవి ఆ ఇంటివైపు పరిగెత్తాడు.

ప్రక్కింట్లో వుండేది కాంట్రాక్టరు బాలకృష్ణయ్యగారు.ఆయనకి నలుగురు పిల్లలు. ముగ్గురు అబ్బాయిలు, ఒక అమ్మాయి. అమ్మాయి అఖిలకి ఆరునెలల క్రితం పెళ్ళయి అత్తవారింటికి వైజాగ్ వెళ్ళింది. అఖిల ఇప్పుడు గర్భవతి.

'ఏం జరిగి వుంటుంది?' నా మనసు కీడు శంకించడం మొదలుపెట్టింది.

"ఏమిటి మమ్మీ? ఈశ్వరి ఆంటీ వాళ్ళింట్లో ఏమైంది" నిద్రలేచిన రాధ కంఠంలో వణుకు.

"నాకూ తెలియదమ్మా, అన్నయ్య వెళ్ళాడు తెలుసుకుందామని!" ఒక్కొక్క అక్షరం కూడ బలుక్కుని అతికష్టం మీద చెప్పగలిగాను.

"మమ్మీ!" ... పరిగెత్తుకుంటూవచ్చిన రవి ఆయాసపడుతూ నుంచున్నాడు.

"ఏమిటన్నయ్యా, ఏమైంది?"

"రాధా ... అఖిల ... అఖిల భర్త 'వెంకట్' ఆత్మహత్య చేసుకున్నాడట!"

అందరం మ్రాన్పడిపోయాం. ఆ షాక్ నుండి తేరుకోవడానికి కొన్ని నిమిషాలు పట్టింది.

అఖిల, వెంకట్ ఇద్దరూ ఇద్దరే! అందంలో ఒకరిని మించిన వారు ఇంకొకరు. చూడచక్కని జంట. 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' అని పెళ్ళికొచ్చిన

వాళ్ళందరూ ముచ్చటపడ్డారు. కానీ వాళ్ళ జీవితం మూడునాళ్ళ ముచ్చటే అయింది.

మూడురోజుల తరువాత అఖిలని తీసుకొని వచ్చేశారు. వెంకట్ అంత్యక్రియలు వైజాగ్‌లోనే జరిగాయి.

రాధని తోడు తీసుకుని వెళ్ళాను పరామర్శించడానికి. అంతా హడావుడిగా వుంది. వెళ్ళేవాళ్ళు, వచ్చేవాళ్ళతో ఇల్లు ఖాళీలేదు. అక్కడ వున్నవాళ్ళు రకరకాలుగా మాట్లాడుకుంటున్నారు. అందరూ వెంకట్ ఆత్మహత్య గురించి ఊహాగానాలు చేస్తున్నారు.

అఖిల వున్న గదిలోకి వెళ్ళాం. గదినిండా ఆడవాళ్ళు వున్నారు. కొందరు ఓదార్పు మాటలు చెబుతున్నారు. మరికొందరు తమలో తామే మాట్లాడుకుంటున్నారు. గోడకానుకుని విరాగిని లా కూర్చున్న అఖిల నిస్తేజంగా, గమ్యరహితంగా చూస్తోంది.

అఖిలని చూస్తున్న నాలో ఏదో తెలియని ధైర్యం ప్రవేశించింది. నాలోని బాధ విరిగినట్లయింది. ఒక రకమయిన తృప్తిగా అనిపించింది. ఇంతకు ముందున్న నీరసం ఇప్పుడు లేదు. జీవితం మీద క్రొత్త ఆశలు చిగురించాయి.

నాలో హఠాత్తుగా వచ్చిన ఈ మార్పుకి ఆశ్చర్యపోయాను.

'నేను ఇంత దారుణంగా ఆలోచిస్తున్నానేమిటి? నా మనస్తత్వం ఇంత భయంకరమైనదా? ముక్కుపచ్చలారని పిల్ల పసుపుకుంకుమలు పోగొట్టుకుంటే సానుభూతి చూపించాల్సిందిపోయి సంతృప్తి చెందుతున్నానేమిటి? జీవితంలో మూడు వంతులు అయిపోయిన దాన్ని నేనే ఇన్నాళ్ళుగా, ఇంతగా కృంగిపోతుంటే ఎంతో జీవితం ముందున్న అఖిల పరిస్థితి ఏమిటి?'

'అంటే ... నా బాధ ముందు తన బాధ చిన్న గీత ప్రక్కన పెద్దగీత అయిందా? మనిషికీ, మనిషికీ మధ్య బంధం ఇదేనా? ఈ మనిషి నైజం ఇంత నీచమయినదా? తన కంటే పెద్ద సమస్యలున్నవాడే అసలైన ఓదార్పునిస్తాడా?!'

అఖిల దగ్గరికి రాధ సహాయం లేకుండానే నడిచాను.

◇

